నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, మంగళవారం 11 ఫిబ్రవరి 2025 | SIDDIPET

హరీశ్‌రావు లేఖకు స్పందించిన గడ్కరీ

నంగునూరు, ఫిబ్రవరి 10: సిద్దిపేట-ఎల్కతుర్తి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా సిద్దిపేట నియోజకవర్గంలోని నంగునూరు మండలం రాజగోపాల్‌పేట వద్ద సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్‌తో కూడిన డ్రైనేజ్ ఏర్పాటు చేయాలని ఇటీవల మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాశారు. ఈ మేరకు గడ్కరీ సానుకూలంగా స్పందించి హరీశ్‌రావుకు తిరిగి లేఖ రాశారు. లేఖలో పేర్కొన్న జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రాజ్‌గోపాల్‌పేటలో సెంట్రల్ లైటింగ్, డ్రైనేజ్ సిస్టమ్‌తో ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టాలని కోరారని, వాటి ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించామని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. తన లేఖకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరీకి హరీశ్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు.

మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖకు తిరిగి లేఖ రాసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

నీచ రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ

పోతారంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

- కాంగ్రెస్ మోసాలకు వత్తాసు పలుకుతున్న బీజేపీ
- అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్
- స్థానిక ఎన్నికల్లో గులాబీ ప్రభంజనం తథ్యం
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఫిబ్రవరి 10: కుల, మతాల పేరిట ప్రజల మధ్య చిచ్చుపెట్టి కాంగ్రెస్, బీజేపీ నీచ రాజకీయాలు చేస్తున్నాయని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం దుబ్బాక మండలం పోతారంలోని తన నివాసంలో మీడియాతో ఆయన మాట్లాడారు. మతం పేరిట కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కులాల పేరిట కాంగ్రెస్ అనుసరిస్తున్న తీరు ఒకేలా ఉన్నాయని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేలో బీసీల సంఖ్యను తగ్గించి చూపించడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీ, ఎస్సీలను కాంగ్రెస్, బీజేపీ చిన్నచూపు చూస్తున్నాయని ఆరోపించారు. బీసీ, ఎస్సీల అభ్యున్నతి కోసం కేసీఆర్ సర్కారు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని, కాంగ్రెస్ సర్కారు వారి మధ్యన చిచ్చుపెట్టిందని దుయ్యబట్టారు. అనేక హామీలిచ్చి గద్దెనెక్కిన తర్వాత కాంగ్రెస్ ప్రజలను నిలువునా మోసగించిందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేసి సీఎం రేవంత్ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని హితవు పలికారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలపై త్వరలోనే సుప్రీం కోర్టు తీర్పు వెలువరించనుందని తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి జిల్లాలో ఇప్పటి వరకు ఏ ఒక్క సమీక్షా సమావేశం నిర్వహించలేదన్నారు. జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మాటలు తప్ప పాలన చేతకాదన్నారు. ఇన్‌చార్జి మంత్రి సురేఖ జిల్లాకు వస్తే ఏదోరకమైన ఇష్యూ లేవనెత్తి వెళ్తున్నదని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రాజమౌళి, రవీందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రాజు, కైలాష్, రాంరెడ్డి, వంశీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజయవంతం చేయాలి

బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ

చిన్నకోడూరులో మాట్లాడుతున్న వేలేటి రాధాకృష్ణ శర్మ

చిన్నకోడూరు, ఫిబ్రవరి 10: ఈనెల 13 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే మండల స్థాయి కేసీఆర్ వాలీబాల్ టోర్నీని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ పిలుపునిచ్చారు. చిన్నకోడూరులో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని చిన్నకోడూరులో ఈనెల 13, 14, 15 తేదీల్లో జరిగే టోర్నీలో క్రీడాకారులు పాల్గొంటారని, 17న సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు. ఈ టోర్నీలో 40 టీమ్‌లు పాల్గొంటాయని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ క్రీడలను ప్రోత్సహించారని, గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. 20 ఏండ్లుగా కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించుకుంటున్నామని, ఇందులో భాగంగా క్రీడలు నిర్వహిస్తే తప్పేముందని ఆయన ప్రశ్నించారు. మండల సమన్వయ కర్త పాల సాయిరాం, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. సిద్దిపేటను ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు క్రీడా హబ్‌గా మార్చేందుకు ఎంతగానో కృషి చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సిద్దిపేటలో క్రికెట్ మినీ స్టేడియం నిర్మించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఫైనల్‌లో గెలిచిన క్రీడాకారులకు మొదటి బహుమతి లక్ష రూపాయలు నగదు, రెండో బహుమతి రూ.75 వేలు, మూడో బహుమతి రూ.50వేలు అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. హరీశ్‌రావు సూచన మేరకు ప్రతి రోజు క్రీడాకారులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కనకరాజు, ఉమేశ్ చంద్ర, జంగిటి శ్రీనివాస్, ఎల్లయ్య, గుండెలు వేణు, గుజ రాజు, రవి, రమేశ్, వినయ్, లింగం, గణేశ్, రఘు, రాజు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూత్ తనిఖీ

కౌడిపల్లి, ఫిబ్రవరి 10: కౌడిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూత్‌ను సోమవారం నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శ్రీహరి, పలువురు అధికారులు ఉన్నారు.

మానవ తప్పిదాలతోనే విమాన ప్రమాదాలు

గీతం వర్సిటీ సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ సత్యానంద్

- ఐఐటీ హైదరాబాద్ సాంకేతిక అధికారి సత్యానంద్

పటాన్‌చెరు, ఫిబ్రవరి 10: విమాన ప్రమాదాలకు మానవ తప్పిదాలు, ట్రాఫిక్ సమస్యలు ప్రధాన కారణమని ఐఐటీ హైదరాబాద్ సాంకేతిక అధికారి డాక్టర్ ఎంవీ సత్యానంద్ అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సోమవారం హైదరాబాద్‌లో ఏరోస్పేస్ విభాగం ఆధ్వర్యంలో 'ఎయిర్ క్రాఫ్ట్ స్ట్రక్చరల్ సిస్టమ్ హెల్త్ మేనేజ్‌మెంట్, అడ్వాన్స్‌డ్ ఎయిర్ మొబిలిటీ' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆధునిక సాంకేతికత ఉపయోగించుకొని విమాన ప్రమాదాలను తగ్గించడంపై దృష్టిసారించాలన్నారు. ఎయిర్ క్రాఫ్ట్ స్ట్రక్చరల్ హెల్త్ మేనేజ్‌మెంట్, ఎయిర్ క్రాఫ్ట్ సిస్టమ్ హెల్త్ మేనేజ్‌మెంట్, ఎయిర్ ట్రాఫిక్, అర్బన్ ఎయిర్ మొబిలిటీ, అడ్వాన్స్‌డ్ ఎయిర్ మొబిలిటీ వంటి కీలక రంగాలను డాక్టర్ ముట్నూరి వివరించారు. అనంతరం అతిథిని ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎండీ అక్తర్‌ఖాన్ ఘనంగా సత్కరించారు. సదస్సులో డాక్టర్ నికుల్ జాని, డాక్టర్ హిమబిందు పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్

గజ్వేల్‌లో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 10: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో దొంగ సర్వే చేపట్టి బీసీ జనాభాను తగ్గించి చూపించి అన్యాయం చేయాలని చూస్తున్నదని, స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ అమలుచేయాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అసమర్థ పాలన నడుస్తున్నదని విమర్శించారు. కేంద్రం నుంచి రూపాయి నిధులు తేలేని దుస్థితితో రేవంత్ సర్కారు ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టారని విమర్శించారు. తెలంగాణను ధనిక రాష్ట్రంగా కేసీఆర్ నిలిపారని, అభివృద్ధి, సంక్షేమంలో అగ్రభాగానికి తీసుకెళ్లారన్నారు. డైవర్షన్ రాజకీయాలు చేస్తున్న రేవంత్‌కు ప్రజల చేతిలో భంగపాటు తప్పదన్నారు. రైతులకు వందశాతం రుణమాఫీ చేయాలని, రైతు భరోసా వెంటనే ఖాతాల్లో జమ చేయాలని, విద్యార్థినులకు స్కూటీలు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దివ్యాంగులకు రూ.6వేలు, నిరుద్యోగులకు రూ.4వేల భృతిని అందజేయాలన్నారు. కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇవ్వాలన్నారు. రైతులకు బోనస్ ఎగ్గొట్టిన దౌర్భాగ్య సీఎం రేవంత్ అని విమర్శించారు. ప్రజాపాలన దరఖాస్తులు చెత్తబుట్ట పాలయ్యాయని విమర్శించారు. మళ్లీ మీసేవ కేంద్రాల్లో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని చెప్పడం కాంగ్రెస్ అసమర్థ పాలనకు నిదర్శనమని వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నవాజ్‌మీరా, మాజీ ఎంపీపీ అమరావతి, మాజీ జడ్పీటీసీ మల్లేశం, నాయకులు దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, గొడుగు స్వామి, బాలచంద్రం, నాగిరెడ్డి పాల్గొన్నారు.

బోనస్..బోగస్

- ఇంకా రైతుల ఖాతాల్లో జమకాని డబ్బులు
- ఎదురుచూస్తున్న రైతులు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో రూ.2.28 కోట్లు పెండింగ్
- తక్షణమే విడుదల చేయాలని డిమాండ్

రైతులకు అందని బోనస్.. సన్నవడ్లు విక్రయించి రెండునెలలు

సిద్దిపేట, ఫిబ్రవరి 10(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పాలనలో రైతులకు చేయూత కరువైంది. ఎన్నికల్లో రైతులకు అనేక హామీలిచ్చిన కాంగ్రెస్, గద్దెనెక్కిన తర్వాత మొండిచేయి చూపుతున్నది. రైతులు పండించిన అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి తీరా షరతులు, కొర్రీలు పెట్టి అన్యాయం చేసింది. వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి తీరా సన్నవడ్లకు మాత్రమే ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సన్నవడ్లు అమ్మి రెండు నెలలు గడుస్తున్నా రైతులకు బోనస్ మాత్రం రావడం లేదు. సిద్దిపేట జిల్లాలో రూ. 1.08 కోట్లు, మెదక్ జిల్లాలో రూ. 1.20 కోట్లు ఉమ్మడి జిల్లాలో మొత్తం రూ. 2.28 కోట్లు బోనస్ డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ డబ్బులు ఎప్పుడూ వేస్తారా అని రైతులు ఎదురు చూస్తున్నారు.

సిద్దిపేట జిల్లాలో...

సిద్దిపేట జిల్లాలో 2,669 మంది రైతుల నుంచి 9,679 క్వింటాళ్ల సన్న వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేసింది. దీని ఎంఎస్‌పీ రూ.27.29 కోట్లు కాగా, బోనస్ డబ్బులు రూ. 4.83 కోట్లు. ఇప్పటి వరకు 2,020 మంది రైతులకు 7,509 క్వింటాళ్లకు సంబంధించిన ఎంఎస్‌పీ డబ్బులు రూ. 27.29 కోట్లు చెల్లించారు. బోనస్‌కు సంబంధించిన రూ.3.75 కోట్లు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ. 1.08 కోట్లు రైతుల ఖాతాలో జమ చేయాల్సి ఉంది.

మెదక్ జిల్లాలో...

మెదక్ జిల్లాలో 53,660 మెట్రిక్ టన్నుల ధాన్యంను 12,872 మంది రైతుల వద్ద కొనుగోలు చేశారు.ఇప్పటి వరకు క్వింటాల్‌కు రూ. 500 చొప్పున 12,577 మంది రైతులకు రూ.124.49 కోట్లు చెల్లించగా, ఇంకా 495 మంది రైతులకు సంబంధించి రూ. 1.20 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

సంగారెడ్డి జిల్లాలో...

సంగారెడ్డి జిల్లాలో 447 మంది రైతుల నుంచి 2,940 క్వింటాళ్ల సన్నవడ్లను ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ జిల్లాలో ఇంకా కొంత మంది రైతులకు బోనస్ రావాల్సి ఉంది. బోనస్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేసింది. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు వేస్తామని చెప్పింది. కానీ, 50 రోజులు దాటినా సన్నవడ్ల బోనస్ డబ్బులు జమ కాలేదని రైతులు చెబుతున్నారు. బోనస్ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ తుంగలో తొక్కింది. పంట రుణమాఫీ సంపూర్ణంగా చేయలేదు. రైతుభరోసా వేయడం లేదు. కంది రైతులను దగా చేస్తున్నది. అనేక ఆంక్షలు పెడుతున్నది. పంట చేతికి వచ్చినా పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాలను ఇంత వరకు ప్రారంభించలేదు. ఆ పంటను ఎక్కడ అమ్ముకోవాలో రైతులు ఆందోళన చెందుతున్నారు.

బోనస్ కోసం ఎదురుచూస్తున్నం..

సీఎం రేవంత్‌రెడ్డి సన్న వడ్లకు బోనస్ ఇస్తమంటే సంతోషపడ్డ. సీఎం హామీతో దొడ్డు వడ్లకు బదులు సన్నాలు పెట్టిన. దొడ్డు వడ్ల కంటే సన్నాల దిగుబడి పది క్వింటాళ్లు తక్కువ వచ్చింది. సీఎం చెప్పిన బోనస్ మాత్రం ఇప్పటికీ రాకపాయే. 40క్వింటాళ్ల సన్నాలు అమ్మిన. నాకు సర్కార్ నుంచి రూ. 20వేల వరకు బోనస్ రావాలే. రైతుల కిస్తమన్న బోనస్ ముచ్చటను సర్కార్ మర్సిపోయినట్లుంది. బోనస్ కోసం ఎదురు చూస్తున్నం.

– సిరిమల్ల భాస్కర్, రైతు, లింగాపూర్ (ధూళిమిట్ట మండలం)

బోనస్ పేరిట మోసపోయినం..

కొమురవెల్లి, ఫిబ్రవరి 10: ప్రభుత్వం సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తానంటే మురిసినం. గి పెట్టుబడి మొత్తం అడికాడికైనా ప్రభుత్వం ఇచ్చే బోనస్ లాభం వస్తుందనుకున్నా. వొడ్లు కాంట పెట్టి 3 నెలలు కావస్తున్నది. మళ్ల పంట కూడా చేతికొచ్చే సమయమైంది. గింత వరకు గా బోనస్ పడనేలేదు. బోనస్ గురించి ఎవర్ని అడగాలో తెలుస్తలేదు. తోటోళ్ల లెక్క నేను దొడ్డు బియ్యం పండించినా బాగుండే. సన్నవొడ్లు పెడితే దిగుబాడి తక్కువొచ్చే ప్రభుత్వం బోనస్ ఇయ్యకపాయే. పని చేసుకొని బతుకే మా లాంటోళ్లతో అబద్ధాలెందుకు చెప్పాలి. బోనస్ పేరిట సన్నవొడ్లు పెట్టి మోసపోయినం.

– పచ్చిమడ్ల ఐలేని, రైతు, రసూలాబాద్

రూపాయి రాలేదు..

మిరుదొడ్డి, ఫిబ్రవరి 10: ఇప్పటి వరకు బోనస్ పైసలు ఒక్క రూపాయి ఖాతాల పడలేదు. ఎన్నికప్పుడు క్వింటాల్ వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెసోళ్లు చెప్పిర్రు. ఇప్పుడేమో ఏమి ఇవ్వడం లేదు. రైతులను మోసం చేస్తుండ్రు. గీ కాంగ్రెస్ సర్కారు రైతుల సంక్షేమాన్ని పట్టించుకుంట లేదు. రైతుభరోసా ఇవ్వడం లేదు. గిట్ల యితే రైతులం ఎట్ల పంటలు పండించాలి.

– దార కృష్ణయ్య, రైతు, మిరుదొడ్డి

మా బతుకులను ఆగం చేయొద్దు

- నల్లవల్లిలో 6వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్ష

నల్లవల్లిలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న ప్రజలు

గుమ్మడిదల, ఫిబ్రవరి 10: డంపింగ్‌యార్డు చెత్త కంపుతో తమ జీవితాలను ఆగం చేయొద్దని నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లిలో డంపింగ్ యార్డు ఏర్పాటును విరమించుకోవాలని చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం ఆరోరోజుకు చేరుకున్నాయి. సోమవారం కొత్త పల్లి, నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల విద్యార్థులు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందర్‌రావుకు తమ ఆందోళనలు పట్టవా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించి డంపింగ్ యార్డు ఏర్పాటును అడ్డుకోవాలని కోరారు. ఆరు రోజులుగా అన్ని పనులు వదులుకుని ఆందోళనలు చేస్తుంటే అధికారులు స్పందించక పోవడం బాధాకరమని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనలో నల్లవల్లి జేఏసీ నాయకులు ఫయాజ్, కుమ్మరి ఆంజనేయులు, మాజీ సర్పంచులు శంకర్, శ్రీనివాస్‌ముదిరాజ్, మన్నె రామకృష్ణ, సత్తయ్య, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతికి అరుదైన గౌరవం

ఝరాసంగం, ఫిబ్రవరి 10: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని బర్దిపూర్ గ్రామ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి సిద్ధేశ్వరానందగిరి మహారాజ్‌కు అరుదైన గౌరవం లభించింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతున్న మహా కుంభమేళాలో వివిధ అఖాడలకు సంబంధించిన మఠాధిపతులు, పీఠాధిపతులు హాజరయ్యారు. ఇందులో శంకరాచార్యులు స్థాపించిన అఖిల భారత పంచ దశనామ జూన అఖాడ, ఇది పరమేశ్వరుడు, దత్తాత్రేయ భగవానుని ఆరాధన దీని లక్ష్యం. జూన అఖాడకు తెలంగాణ నుంచి మహామండలేశ్వర అధిపతిగా సిద్ధేశ్వరానందగిరి మహారాజ్‌ను ఎంపిక చేసి పట్టాభిషేకం చేశారు. దీంతో ఆశ్రమ పీఠాధిపతి అవధూతగిరి మహారాజ్, వివిధ ఆశ్రమాల మఠాధిపతులు, పీఠాధిపతులు, భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

మహామండలేశ్వర అధిపతిగా నియమిస్తున్న అఖాడ అధిపతి అవదేశానందగిరి మహారాజ్

ఈ ప్రయాణం డేంజర్

సిద్దిపేట పట్టణం రోజురోజుకూ విస్తరిస్తున్నది. నిత్యం రోడ్లపైకి కొత్త వాహనాలు వస్తున్నాయి. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పలుచోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ అలంకారప్రాయంగా మారాయి. ఈ సమస్యలు వేధిస్తుండగా పలువురు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కలెక్టరేట్ ఎదుట రాజీవ్ రహదారిపై యూటర్న్ చేసుకోవాలంటే కిలోమీటర్ దూరం వెళ్లాల్సి ఉండడంతో చాలామంది వాహనదారులు రాంగ్ రూట్‌లో వాహనాలపై వెళ్తున్నారు. సామాన్యులే కాకుండా ప్రభుత్వ అధికారుల వాహనాలు సైతం రాంగ్ రూట్‌లో వెళ్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పోలీసులు నిఘా పెట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– సిద్దిపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఫిబ్రవరి 10

రాంగ్ రూట్లో పోలీసు వాహనం

పాత పంటల పరిరక్షణే లక్ష్యం

- ఎద్దులబండ్లతో ఊరూరా తిరుగుతూ అవగాహన
- చిరుధాన్యాలు సాగుచేయాలని సూచనలు
- విత్తనశుద్ధి నుంచి మార్కెటింగ్ వరకు మెళకువలు
- నేడు మచ్నూర్‌లో పాత పంటల జాతర ముగింపు వేడుకలు

విశేషంగా కృషిచేస్తున్న డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు

ఎద్దుల బండ్లతో ఊరేగింపు నిర్వహిస్తున్న డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు, రైతులు

చిరుధాన్యాల విత్తనాల కుండలతో ఊరేగింపు చేపడుతున్న డీడీఎస్ సభ్యులు, మహిళా రైతులు

జహీరాబాద్/ఝరాసంగం, ఫిబ్రవరి 10: కనుమరుగవుతున్న పాత పంటలైన చిరుధాన్యాలను కాపాడడమే లక్ష్యంగా డెక్కన్ డెవలప్‌మెంట్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాత పంటల జాతర పండుగలా కొనసాగుతున్నది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని వడ్డి గ్రామంలో సంక్రాంతి నాడు ప్రారంభమైన పాత పంటల జాతర మంగళవారం (నేడు) ఝరాసంగం మండలంలోని మచ్నూర్‌లో ముగియనున్నది. పాత పంటల విత్తనాలతో అందంగా అలంకరించిన ఎద్దులబండ్లతో డప్పు చప్పుళ్లు, మహిళా సంఘాల సభ్యులు, రైతుల నృత్యాలు, పాటలు, కోలాటాల ప్రదర్శన 26 రోజులుగా జహీరాబాద్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుతో పాతపంటల జాతర నిర్వహిస్తున్నారు. జీవవైవిధ్యం నుంచి సుస్థిర వ్యవసాయం వైపు రైతులను నడిపించి, పాత పంటలను పరిరక్షించేందుకు డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు విశేష కృషిచేస్తున్నారు. డీడీఎస్ మహిళా సంఘాలు సభ్యులు 80 రకాల పాత పంటల విత్తనాలను కాపాడుతున్నారు. సేంద్రియ సాగు గురించి వివరిస్తున్నారు. సాగులో లేని ఆకుకూరలను పరిచయం చేశారు. నేడు జరిగే ముగింపు వేడుకలకు డీడీఎస్ ప్రతినిధులు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేశారు. ముగింపు వేడుకల్లో మహిళా రైతులను సన్మానించనున్నారు. ఈ వేడుకలను స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వ్యవసాయ నిపుణులు తదితరులు రానున్నట్లు డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య వెలుగురి తెలిపారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం...

రోజురోజుకూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆహారపు అలవాట్లతో ప్రస్తుతం ప్రజలంతా అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ప్రస్తుత రోజుల్లో చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆరోగ్య నిపుణులు, వైద్యాధికారులు సూచిస్తున్నారు. కనుమరుగవుతున్న పాత పంటలను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఎంతైనా ఉందని, వాటిని సాగు చేసుకోవాలని డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు సూచిస్తున్నారు. రానున్న రోజుల్లో పాత పంటలైన చిరుధాన్యాలకు మంచి రోజులు రానున్నాయని కేంద్ర ప్రభుత్వ ప్రాంతీయ ఐసీఏఆర్ డైరెక్టర్ అటారి జోన్-10 డా. షేక్ ఎన్.మీరా పేర్కొన్నారు. రాగులు, కొర్రలు, అవిసలు, జొన్నలు, సామలు, సజ్జలు వంటి చిరుధాన్యాలతో పాటు తెల్లగవ్వల కూర, ఉత్తరేణి, జొన్న చెంచులి, పానగంటి కూర, తలేల్ల ఆకుకూర, ఎలకచెవినకూర, సన్నపాయల కూరల్లో అనేక పోషక విలువలు ఉన్నాయని, వాటిని ఆహారంగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మహిళా సంఘాల సభ్యులు సూచిస్తున్నారు. డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు పాత పంటలైన చిరుధాన్యాలను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. పాత పంటల చిరుధాన్యాలతో వంటకాలతో జహీరాబాద్ పట్టణంలో కెఫే ఎథ్నిక్ హోటల్‌ను నడిపిస్తున్నారు.